క్లుప్తంగా

కిరాణా దుకాణాల్లో పోలీసులు తనిఖీలు

ముదిగొండ: ముదిగొండ కేంద్రంలోని పలు కిరాణా, పాన్ దుకాణాల్లో పోలీసులు గురువారం తనిఖీలు నిర్వహించారు. కిరాణా, పాన్ షాపులు, టీస్టాళ్లల్లో గంజాయి చాకెట్లు, పేపర్ రోల్స్ విక్రయిస్తున్నట్లు సమాచారం రావాడంతో పోలీస్ సిబ్బంది నాలుగు బృందాలుగా ఏర్పడి మండల కేంద్రంలోని అన్ని దుకాణ విక్రయ కేంద్రాల్లో తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా సీఐ మురళి మాట్లాడుతూ.. గంజాయి చాకెట్లు విక్రయించినా, వాటిని సేవించినా, గంజాయితో పట్టుబడినా ఎంతటివారినైనా ఉపేక్షించేది లేదన్నారు. కార్యక్రమంలో ఎస్సైలు అనంతరాములు, కృష్ణప్రసాద్, ట్రెయినీ ఎస్సైలు హరిత, శ్రీకాంత్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

'యాక్షన్ ప్లాన్ 'ను విజయవంతం చేయాలి


సూచనలు చేస్తున్న మున్సిపల్ కమిషనర్ వేణు

వైరా: తెలంగాణ ప్రభుత్వం జూన్ 2వ తేదీ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహించే యాక్షన్‌ప్లాన్ పనులను విజయవంతం చేయాలని మున్సిపల్ కమిషనర్ చింతల వేణు అన్నారు. గురువారం మున్సిపాలిటీ కార్యాయలంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. యాక్షన్‌ప్లాన్‌లో భాగంగా కాల్వల పూడికతీత, రోడ్లు శుభ్రపర్చడం, మొక్కలు నాటడం, అంటు వ్యాధులు ప్రభలకుండా నివారణ చర్యలు చేపట్టనున్నట్లు వివరించారు. సీనియర్ అసిస్టెంట్ బి.నరసింహమూర్తి, ఎన్విరాన్మెంట్ ఇంజనీర్ బి.వెంకట్రావు, జూనియర్ అకౌంటెండ్ సుధీర్ బాబు, శానిటరి జవాన్లు, డ్రైవర్లు పాల్గొన్నారు.

విత్తనాల ధరలు తగ్గించాలి

కారేపల్లి: రైతులకు సబ్సిడీపై విత్తనాలను అందిస్తున్నామని ప్రభుత్వం గొప్పలు చెబుతుందని, విత్తనాల ధరలను ఒకేసారి రెండితలు పెంచి రైతులను అప్పుల పాలు చేస్తుందని తెలంగాణ రైతు సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు ఏకాంబరం, రామారావు అన్నారు. గురువారం కారేపల్లిలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. రైతులకు రైతు భరోసా అందించలేదు కానీ విత్తనాల ధరలను పెంచిందన్నారు.

జాతీయ జెండాలతో తిరంగా ర్యాలీ


జాతీయ జెండాలతో ర్యాలీ నిర్వహిస్తున్న అఖిలపక్ష నాయకులు

తల్లాడ: పెహల్గాం దాడికి ప్రతీకారంగా 22 నిముషాల్లో ఉగ్రవాద శిబిరాలను ధ్వంసం చేసి పాకిస్తాన్‌కు గట్టి హెచ్చరిక చేసిన భారత సైన్యానికి మద్దతుగా తల్లాడలో గురువారం జాతీయ జెండాలతో తిరంగా ర్యాలీ నిర్వహించారు. తల్లాడ నుంచి నారాయణపురం గ్రామం వరకు కులమతాలకు అతీతంగా హాజరై జాతీయ జెండాలతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఈవి రమేష్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావు, బీజేపీ తల్లాడ మండల అధ్యక్షుడు నాగులు, నాయకులు, లయన్స్ సభ్యులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు కార్మికులను పర్మనెంట్ చేయాలి



మాట్లాడుతున్న టీయూసీఐ నాయకుడు రామయ్య

కారేపల్లి: విశాఖ స్టీల్ ప్లాంట్ అనుబంధ మాధారం డోలమైట్ మైన్‌లో పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేయాలని టీయూసీఐ జిల్లా కార్యదర్శి రామయ్య అన్నారు. గురువారం మాధారంలో జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వీఎస్పీ యాజమాన్య తీరుతో కాంట్రాక్టు కార్మికులు శ్రమదోపిడికి గురి అవుతున్నారన్నారు. ఇప్పటికే విశాఖ స్టీల్ ప్లాంట్‌లో 3వేల మంది కాంట్రాక్టు కార్మికులను తొలగించి, కనీసం వారికి బెనిఫిట్స్ సైతం ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో టీయూసీఐ నాయకులు ధరావత్ సక్రు, ఎస్‌కే ఖైరుద్దీన్, వీరూనాయక్, ఇబ్రహీం, హుస్సేన్, రవి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఎర్రుపాలెంలో షెల్టర్ లేక దుకాణాల ఎదుట నిలబడిన ప్రయాణికులు



బస్సు షెల్టర్లేవి..?

- రోడ్డుపైనే నిరీక్షిస్తున్న ప్రయాణికులు
- నిరుపయోగంగా మారిన బస్టాండ్
- టాయిలెట్లు లేక అవస్థలు
- పట్టించుకోని ఆర్టీసీ అధికారులు


నిరుపయోగంగా అంబేడ్కర్ సెంటర్‌లోని బస్ స్టేషన్

ఎర్రుపాలెం: మండలకేంద్రంలోని మధిర – విజయవాడ ప్రధాన రహదారిపై రింగ్ సెంటర్‌లో బస్ షెల్టర్ లేక ప్రయాణికులు అవస్థలకు పడుతున్నారు. బస్సుల కోసం రహదారిపై ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ వేచి చూడాల్సిన దుస్థితి ఏర్పడింది. మండలకేంద్రం కావడంతో ఎర్రుపాలెం మండలం పెగళ్లపాడు, మీనవోలు, పెద్దగోపవరం, తెల్లపాలెం, రేమిడిచర్ల, కొత్తపాలెం, బనిగండ్లపాడు ఇలా చాలా గ్రామాలతో పాటు ఏపీకి చెందిన జయంతి, పెద్దాపురం, గూడెం మాధవరం గ్రామాల ప్రజలు రకరకాల అవసరాల నిమిత్తం నిత్యం రాకపోకలు సాగిస్తున్నారు. ఈ రహదారిపై నిత్యం మధిర ఆర్టీసీ డిపోతో పాటుగా ఏపీలోని ఇబ్రహీంపట్నం డిపో సర్వీసులు మధిర టూ విజయవాడకు, జమలాపురం టూ వయా కొత్తపాలెం మీదుగా విజయవాడకు ఆర్టీసీ బస్సులు నడుపుతుంది.

నిరీక్షిస్తున్న ప్రయాణికులు..

ప్రయాణికులతో రింగ్ సెంటర్ ఎప్పుడూ రద్దీగా ఉంటుంది. ఇక్కడ బస్ షెల్టర్ లేకపోవడంతో ప్రయాణికులు సెంటర్లలోని దుకాణాల వద్ద ఏర్పాటు చేసిన షెడ్లలో, హోటల్స్‌లో నిరీక్షించాల్సి పరిస్థితి ఏర్పడింది. దుకాణాల యజమానుల చీత్కారాలకు ప్రయాణికులు గురికావాల్సివస్తుంది. మహిళలకు టాయిలెట్లు లేక ఇబ్బందులు పడుతున్నారు. ఆర్టీసీ, ప్రభుత్వ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు ముక్తకంఠంతో కోరుతున్నారు.

నిరుపయోగంగా బస్టాండ్..

మండలకేంద్రంలోని తహసీల్ సమీపంలోని అంబేడ్కర్ సెంటకొంల ప్రధాన రహదారి కాని ఏరియాలో దశాబ్దాల క్రితం రూ.10లక్షలతో నిర్మించిన ఆర్టీసీ బస్ స్టాండ్(బస్ స్టేషన్) పూర్తిగా నిరుపయోగంగా మారింది. ఈబస్‌స్టాండ్ వైపు బస్సులే తిరగవు. తెలంగాణా తిరుపతి జమలాపురం గ్రామానికి నడుపుతున్న ఏపీ రాష్ట్రం ఇబ్రహీంపట్నం డిపోకు చెందిన ఒకటి రెండు బస్సులు అటుగా వెళ్లినా.. అక్కడ ఆగవు. బస్‌స్టాండ్ పూర్తిగా శిథిలమై అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. అప్పట్లో ఆర్టీసీ అధికారులు చేసిన అనాలోచితమైన నిర్ణయం కారణంగా నేడు ఆ బస్టాండ్ ఎందుకు పనికి రాకుండా పోయింది.

ఇబ్బందులు పడుతున్నాం..



మండలకేంద్రంలోని రింగ్ సెంటర్లో బస్సు షెల్టర్ లేక ఇబ్బంది పడాల్సి వస్తుంది. ఎండాకాలంలో నిలువ నీడలేక ఎండాల్సిన పరిస్థితి దాపురించింది. ఇక వానాకాలంలో తడవాల్సిందే. మండలకేంద్రం కూడలి కావడంతో పలు ప్రాంతాల ప్రజలు ఇక్కడకే వచ్చి బస్సులు ఎక్కాలి.

– బుర్రా మల్లిఖార్జున్, ప్రయాణికుడు, ఎర్రుపాలెం

వసతి కల్పించాలి..



మండలకేంద్రానికి నిత్యం వందలాది మంది ప్రయాణికులు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం చేసేందుకు వస్తున్నారు. మధిర – విజయవాడ ప్రధాన రహదారిలో ఉన్న ఎర్రుపాలెం రింగ్ సెంటర్లో బస్సులు ఆగుతున్నాయి. కాకపోతే ఇక్కడ బస్సు షెల్టర్, టాయిలెట్ సౌకర్యం లేక ఇబ్బందులు పడాల్సి వస్తుంది.

– దేవంబొట్ల హరినాథ్, ప్రయాణికుడు, రేమిడిచర్ల

ప్రతిపాదనలు పంపించాం..



మండలకేంద్రంలోని ప్రధాన రహదారిపై రింగ్ సెంటర్లో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్న విషయం వాస్తవమే. అయినప్పటికీ ఆర్టీసీ ఎక్కడా బస్ షెల్టర్ల నిర్మాణం చేపట్టదు. బస్‌స్టేషన్లు మాత్రమే నిర్మిస్తుంది. మధిర – విజయవాడ ప్రధాన రహదారి వెంబడి ప్రభుత్వం స్థలాన్ని కేటాయించాలని ప్రజాప్రతినిధులకు ప్రతిపాదనలు పంపడం జరిగింది.

– డి.శంకర్‌రావు, ఆర్టీసీ డీఎం, మధిర

తక్కువ ఖర్చుతో నాణ్యమైన వైద్యం


హెల్త్‌కార్డులతో డాక్టర్ కొండల్‌రావు, పాస్టర్లు

మధిర: నిరుపేదలకు తక్కువ ఖర్చుతో నాణ్యమైన వైద్యసేవలు అందిస్తామని ఏకేఆర్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ అధినేత డాక్టర్ ఏ.కొండల్‌రావు తెలిపారు. ఆస్పత్రిలో గురువారం జరిగిన పాస్టర్ల సదస్సులో ఆయన మాట్లాడారు. పాస్టర్ల కుటుంబాలకు 50శాతం తక్కువ చార్జీతో వైద్యం అందిస్తామని తెలిపారు. అనంతరం ఆస్పత్రి తరఫున రూపొందించిన హెల్త్ కార్డులు అందజేశారు. ఈమేరకు కొండల్‌రావును పాస్టర్లు సన్మానించారు. ఈ కార్యక్రమంలో కె.అప్పారావు, నాగేశ్వరావు, చావా వేణు, ప్రసాద్, బాలరాజ్, ఆనంద్‌రారావు, బాబురావు నథానియేలు, యేసురత్నం, జి.దయాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న ఎంపీడీఓ చంద్రశేఖర్

కల్లూరురూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలపై లబ్ధిదారులకు గురువారం కల్లూరు మండల పరిషత్ కార్యాలయంలో అవగాహన కల్పించారు. అనంతరం మండల పరిషత్ ఆవరణలో నిర్మించే ఇందిరమ్మ గృహాలను చూయించారు. ప్రభుత్వం ఒక్కొక్క గృహానికి రూ.5 లక్షలు చెల్లిస్తుంది. వీటిని నాలుగు దశలుగా చెల్లిస్తారు. 400 నుంచి 600 అడుగుల స్థలంలో ఇంటిని నిర్మించుకోవాలని అధికారులు సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ దాసరి చంద్రశేఖర్, ఎంపీఓ రంజిత్‌కుమార్, హౌస్ ఏఈ, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, అందిరమ్మ గృహాల లబ్ధిదారులు పాల్గొన్నారు.

'ఉపాధి' కూలీలందరికీ పని కల్పించాలి


మాట్లాడుతున్న దండు ఆదినారాయణ

సత్తుపల్లిరూరల్: ఉపాధిహామీ కూలీలందరికీ పనులు కల్పించి వారికి రావల్సిన పెండింగ్ బిల్లులు చెల్లించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం (బీకేఎంఎల్) జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ దండు ఆదినారాయణ డిమాండ్ చేశారు. గురువారం సత్తుపల్లి మండలం కొత్తూరులో జరిగిన ఉపాధిహామీ కూలీల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఉపాధిహామీ పథకం కూలీల కోసం వచ్చిన పథకం అని, దీనిని కాంగ్రెస్ యూపీఏ వామపక్షాల సహకారంతో తీసుకురావటం జరిగిందన్నారు. ఈ ఉపాధిహామీ పథకాన్ని నీరుగార్చేందుకు మోదీ ప్రభుత్వం ప్రయత్నం చేస్తుందన్నారు. దీనిపై సీపీఐ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో దశల వారీగా పోరాటం నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఉపాధిహామీ కూలీలు రత్నకుమారి, రమణ, వెంకటమ్మ, రామలక్ష్మి, పావని, లక్ష్మి, కుమారి, సైదా పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

ముదిగొండ: ప్రమాదవ శాత్తు రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలైన సంఘటన మండలంలోని చిరుమర్రి సమీపంలో గురువారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. న్యూలక్ష్మీపురానికి చెందిన రాకేష్ చిరుమర్రి వైపు కూలీ పని కోసం వెళ్తుండగా.. ఎదురుగా వస్తున్న ఓ ద్విచక్ర వాహనం అదుపు తప్పి అతనికి తగలడంతో కాళ్లకు, చేతులకు గాయాలైయ్యాయి. ఆ ఘటనను చూసిన రెవెన్యూ సిబ్బంది 108కు సమాచారం అందించడంతో.. క్షతగాత్రుడిని ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

ఆదివాసీలపై దాడులు ఆపాలి


మాట్లాడుతున్న సీపీఐ నాయకుడు సురేష్

కారేపల్లి: ఆపరేషన్ కగార్ పేరుతో.. కేంద్ర ప్రభుత్వం ఆదివాసీలపై చేస్తున్న దాడులకు ఆపాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్ అన్నారు. గురువారం మాధారం గ్రామ శాఖ మహాసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ దేశ పౌరులైన మావోయిస్టులతో శాంతి చర్చలు జరపటానికి కేంద్ర ప్రభుత్వం ఎందుకు సుముకంగా లేదని, వారి సమాజంలోకి వస్తే ప్రజలు చైతన్య వంతులై, వీరి పెట్టుబడి దారి వ్యవస్థలను ప్రశ్నిస్తారని భయపడ్డారన్నారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో మాధారం సీపీఐ గ్రామ శాఖలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామ శాఖ కార్యదర్శిగా పోతనబోయిన సహదేవ్, సహాయ కార్యదర్శిగా ఎస్‌కే అమీర్‌జాని, బట్టు లింగయ్యతో పాటు 23 మందితో శాఖ కౌన్సిల్‌ను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సీపీఐ వైరా నియోజకవర్గ ఇంచార్జి ఎర్రబాబు, జిల్లా కార్యవర్గ సభ్యులు రావి శివరామకృష్ణ, నాయకులు పాపిని సత్యనారాయణ, బట్టు లింగయ్య, పోతనబోయిన రవి, రాయల రామారావు, సహదేవ్, రామకోటయ్య, గోపాలరావు, నరేష్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేపట్టాలి

సత్తుపల్లిటౌన్: తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా మంజూరు చేసిన ఇందిరమ్మ ఇంటి నిర్మాణ పనుల మంజూరు పత్రాలు అందుకున్న లబ్ధిదారులు 45 రోజుల్లోగా తప్పని సరిగా మొదలు పెట్టాల్సిందేనని సత్తుపల్లి మున్సిపల్ కమిషనర్ కె.నర్సింహా స్పష్టం చేశారు. గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఇందిరమ్మ లబ్ధిదారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఇంటి బేస్మెంట్ స్థాయికి రూ.లక్ష, గోడలకు రూ.లక్ష, శ్లాబ్ పూర్తి అయ్యాక రూ.2 లక్షలు, ఇంటి నిర్మాణం పూర్తి అయ్యాక రూ.లక్ష చొప్పున మొత్తం ఐదు లక్షలు నేరుగా లబ్ధిదారుని బ్యాంకు ఖాతాలో జమ చేయబడతాయని తెలిపారు. మున్సిపాలిటీలో 212 మందికి మంజూరు పత్రాలు పంపిణీ చేయటం జరిగిందని తెలిపారు. ఈ సమావేశంలో మున్సిపల్ మేనేజర్ మైసా శ్రీనివాసరావు, గృహ నిర్మాణశాఖ ఏఈ పవన్, లబ్ధిదారులు పాల్గొన్నారు.

పేదలకు దుప్పట్లు పంపిణీ

మధిర: మధిర గ్రేటర్ వాసవీ క్లబ్ అధ్యక్షుడు కోనా శ్రీనివాసరావు – రాణి పెళ్లిరోజు సందర్భంగా గురువారం సేవా కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా మున్సిపల్ కార్మికులు, దివ్యాంగులకు దుప్పట్లు, పండ్లు పంపిణీ చేశారు. వివిధ సంస్థల బాధ్యులు ప్రసాదరావు, కృష్ణ, కృష్ణారావు, లక్ష్మణరావు, ముత్యాలు, శ్రీనివాసరావు, కొండయ్య పాల్గొన్నారు.

సాయినాథుడికి ప్రత్యేక పూజలు

ఎర్రుపాలెం: మండలంలోని తక్కెళ్లపాడు, భీమవరం, ఎర్రుపాలెం గ్రామాల్లోని సాయినాథుడి ఆలయాల్లో గురువారం బాబాకి ఆయా ఆలయాల అర్చకులు శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు నిర్వహించి, బాబా విగ్రహాలకు పంచామృతాలతో అభిషేకాలు చేశారు. మండలకేంద్రంలోని సాయిబాబా ఆలయంలో మీనవోలు, వీరులపాడు గ్రామాలకు చెందిన తల్లపురెడ్డి జనార్దన్ – కనకమ్మ, నాగ కృష్ణారావు – రాజ్యలక్ష్మి దంపతులు భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు ఆలయ కమిటీ సభ్యులు తదితరులున్నారు.

నివాళులు..

సత్తుపల్లి: సత్తుపల్లి మండలం కిష్టారం మాజీ సర్పంచ్, సొసైటీ చైర్మన్, వ్యాపారవేత్త మామిళ్లపల్లి కృష్ణయ్య దశదినకర్మలో రాష్ట్ర వ్యవసాయశాఖా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ మట్టా దయానంద్, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్యలు వేర్వేరుగా పాల్గొని ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. అదే విధంగా గ్రామ పెద్దలు ఉడతనేని అప్పారావులు శ్రద్ధాంజలి ఘటించారు.

పరామర్శ..

తల్లాడ: మండలంలోని అన్నారుగూడెం గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన బీఆర్ఎస్ నాయకుడు కోవెల కృష్ణయ్య కుటుంభ సభ్యులను గురువారం సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య పరామర్శించారు. కృష్ణయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో తల్లాడ మాజీ ఎంపీపీ శ్రీనివాసరావు, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు వీరమోహన్‌రెడ్డి, కార్యదర్శి వెంకట్‌లాల్ తదితరులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు


ఏన్కూరు: రికార్డులు పరిశీలిస్తున్న ఏడీఏ కరుణశ్రీ


ఎర్రుపాలెం: రింగ్ సెంటర్‌లోని దుకాణంలో తనిఖీ చేస్తున్న ఎస్సై, ఏఓ

ఏన్కూరు: విత్తన దుకాణదారులు నకిలీ విత్తనాలు అమ్మినట్లు తేలితే చట్ట పరంగా కఠిన చర్యలు తీసుకుంటామని వైరా ఏడీఏ తుమ్మలపల్లి కరుణశ్రీ హెచ్చరించారు. గురువారం ఏన్కూరులోని విత్తన దుకాణాలను పరిశీలించి, రైతులతో మాట్లాడారు. డీలర్లు తప్పని సరిగా స్టాక్ రిజిస్టర్ నమోదు చేయాలని, స్టాకు బోర్డుపై తప్పని సరిగా రాసి ఉంచాలన్నారు. అనంతరం స్థానిక రైతు వేదికలో నిర్వహిస్తున్న ఫార్మర్ రిజిస్ట్రీ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. రైతులు తప్పని సరిగా ఫార్మర్ రిజిస్ట్రీలో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఓ నరసింహారావు, ఏఈఓ లహరి పాల్గొన్నారు.

- **పెనుబల్లి:** రైతులు అధీకృత డీలర్ల వద్దనే విత్తనాలు కొనుగోలు చేయాలని సత్తుపల్లి ఏడీఏ వి.శ్రీనివాసరెడ్డి రైతులకు సూచించారు. గురువారం మండలకేంద్రంలో ఉన్న విత్తనాల షాపులను ఏఓ ఏవీఎస్ఎస్ రాజు, ఎస్సై కె.వెంకటేష్, టాస్క్ ఫోర్స్ బృందంతో కలిసి తనిఖీ చేశారు. రాత్రి సమయాల్లో ఎవరైన విత్తనాలు అమ్మితే వారి వివరాలు అందించాలన్నారు.
- **చింతకాని:** మండలంలోని నాగులవంచలో గురువారం విత్తన దుకాణాలను మధిర ఏడీఏ ఎస్.విజయచంద్ర తనిఖీ చేశారు. స్టాక్ రిజిష్టర్లను ఇన్‌వాయిస్ బిల్‌బుక్స్, ప్రిన్స్‌పుల్ సర్టిపికెట్లను పరిశీలించారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి మానస ఉన్నారు.
- **ఎర్రుపాలెం:** మండలకేంద్రంలో విత్తన దుకాణాల్లో ఏఓ బి.సాయిశివ, ఎస్సై ఆర్.రమేష్‌కుమార్ తనిఖీలు నిర్వహించారు. రైతులకు నకిలీ విత్తనాలు అమ్మితే చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఏఈఓ బాలకృష్ణ ఉన్నారు.

రైతులకు సబ్సిడీపై విత్తనాలు పంపిణీ


చింతకాని: జీలుగులు అందిస్తున్న ఏడీఏ విజయచంద్ర

చింతకాని: మండలంలోని నాగులవంచ సొసైటీలో గురువారం రైతులకు జీలుగు విత్తనాలను సబ్సిడీపై ఏడీఏ విజయచంద్ర అందించి మాట్లాడారు. గతంలో జీలుగు విత్తనాలు పక్కదారి పట్టాయని ఆరోపణలు ఉన్నాయని ఈ ఏడాది తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఏఈఓలను ఆదేశించారు. కార్యక్రమంలో ఏఓ మానస, చైర్మన్ నల్లమోతు శేషగిరిరావు, ఏఈఓలు తదితరులు పాల్గొన్నారు.

చెన్నూరు సొసైటీలో..

కల్లూరురూరల్: మండలంలోని చెన్నూరు ప్రాథమిక వ్యవసాయ పరిషత్ సంఘంలో రైతులకు సబ్సిడీపై అందిస్తున్న జీలుగుల పంపిణీ కార్యక్రమాన్ని సొసైటీ సీఈఓ దేవరపల్లి మురళీ పరిశీలించారు. జీలుగులు కావాల్సిన రైతులు పాస్ పుస్తకం, ఆధార్ జిరాక్స్ కాపీలు తీసుకురావాలన్నారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి

కల్లూరురూరల్: రైతులు పంటల సాగులో యాజమాన్య పద్ధతులు పాటించాలని కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ కె.రవికుమార్, ఉద్యానవన శాస్త్రవేత్త డాక్టర్ చైతన్య, పీఎస్ఎం ఫణిశ్రీ తెలిపారు. గురువారం కల్లూరులోని ముచ్చవరి రైతువేదికలో నిర్వహించిన 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు'కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. వ్యవసాయంలో రైతులు తక్కువ స్థాయిలో యూరియా వాడాలని, అవసరం మేరకే రసాయన మందులు పిచికారి చేయాలన్నారు. ఉద్యాన పంటలు రైతులకు లాభదాకంగా ఉంటాయని, సరైన సమయంలో యాజమాన్య పద్ధతులు పాటించాలన్నారు. పామాయిల్ సాగుపై ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలు, సబ్సిడీ గురించి వివరించారు. రైతులు వ్యవసాయంతో పాటు కూరగాయల సాగుపై దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో కల్లూరు, ముచ్చవరం క్లస్టర్ రైతులు పాల్గొని పలు సందేహాలను నివృత్తి చేసుకున్నారు. కార్యక్రమంలో కల్లూరు వ్యవసాయశాఖ అధికారిణి ఎం.రూప, ఏఈఓ పవన్, వెంకట్, సందీప్, లీల పాల్గొన్నారు.

వాల్ పోస్టర్లు ఆవిష్కరణ


పోస్టర్లు ఆవిష్కరిస్తున్న రాష్ట్ర అధ్యక్షుడు రాజేష్ నాయక్, నాయకులు

తల్లాడ: గిరిజన హక్కుల సాధనకై రాష్ట్రస్థాయి కార్యచరణ సభను విజయవంతం చేయాలని హెల్‌హెచ్‌పీఎస్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు ధర్మసోత్ దశరద్ నాయక్ అన్నారు. గురువారం మల్సూర్‌తండాలో నిర్వహించిన కార్యక్రమంలో వాల్‌పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా లంబాడీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు రాజేష్ నాయక్ మాట్లాడుతూ.. వచ్చే నెల 8న ఉదయం 11 గంటలకు ఖమ్మం ఐఎంఎ హాల్‌లో గిరిజన సమస్యలపై జరిగే సదస్సును విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో హెల్‌హెచ్‌పీఎస్ తల్లాడ మండల అధ్యక్షులు భూక్యా రవి నాయక్, భూక్యా శ్రీను, ధర్మసోత్ శ్రీను, తావు నాయక్, బాయి పాల్గొన్నారు.

చెడు వ్యసనాలు దరి చేరనివ్వొద్దు..

ఎర్రుపాలెం: యువత చెడు వ్యసనాలకు బానిసలై తమ జీవితాలను నాశనం చేసుకోవద్దని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు మద్దాల ప్రభాకర్ కోరారు. గురువారం మండలకేంద్రలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో ఈ నెల 30 జమలాపురం నుంచి సైకిల్ యాత్ర ప్రారంభమవుతుందని, ఈ యాత్రను మధిర సీనియర్ సివిల్ అండ్ అసిస్టెంట్ సెషన్స్ కోర్టు జడ్జి ఎన్ ప్రశాంతి ప్రారంభించి మాట్లాడతారన్నారు. ఈ యాత్ర ప్రారంభోత్సవానికి మధిర సీఐ మధు, తహసీల్దార్ ఉషా శారద, మండల వైద్యాధికారి ప్రశాంత్, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ రామ్మూర్తి, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ బోజడ్ల పుల్లారావు, మండల విద్యాశాఖ అధికారి మురళీమోహన్‌రావు, స్థానిక ఎస్సై రమేష్ పాల్గొంటారని తెలిపారు.

రిజర్వాయర్ రహదారి పనులు ప్రారంభం

- 100 అడుగుల నుంచి 60 అడుగులకు కుదించిన అధికారులు
- ప్రస్తుతం ఎన్ని అడుగులో స్పష్టత కరువు


డివైడర్ కోసం రహదారిని తవ్వుతున్న దృశ్యం

వైరా: వైరా రిజర్వాయర్ పర్యాటక ప్రాంతానికి వెళ్లే రహదారికి గత మూడేళ్ల క్రితం రహదారిపై రాజకీయం అలుముకుంది. అఖిలపక్ష నాయకులు సైతం ఆందోళనలు చేపట్టి రహదారి నిర్మాణాన్ని అడ్డుకున్నారు. ఆ తర్వాత రిజర్వాయర్ నిర్మాణ పనులు నిలిచిపోయాయి. బీఆర్ఎస్ ప్రభుత్వం మారి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిన్నర తర్వాత మరల రిజర్వాయర్‌కు వెళ్లే రహదారి పనులు ప్రారంభమయ్యాయి. గత 10 రోజులుగా సీసీ రోడ్డు నిర్మాణ పనులకు అవసరమయ్యే గ్రౌండ్ లెవల్ పనులు చేపడుతున్నారు.

'సుడా' నుంచి నిధులు..

వైరా రిజర్వాయర్‌కు వెళ్లే ప్రధాన రహదారి అభివృద్ధికి మూడేళ్ల క్రితం సుడా రూ.కోటి మంజూరు చేసింది. పనులు ప్రారంభించకపోతే సుడా నిధులు వెనుకకు పోయే అవకాశం ఉండడంతో మున్సిపాలిటీ ఇంజనీరింగ్ అధికారులు యుద్ధప్రతిపాదిన పనులు చేపడతున్నారు. ప్రస్తుతం సీసీ రోడ్డు నిర్మాణం, డివైడర్, సెంట్రల్ లైటింగ్ నిర్మాణ పనులు చేపట్టనున్నారు. ఈ రహదారి 280 మీటర్ల పొడవు డివైడర్ నుంచి 4 మీటర్ల చొప్పున రెండు వైపులా 8 మీటర్లు వెడల్పుతో నిర్మాణ పనులు చేపడతున్నారు. రూ.కోటి నిధులతో మిగిలిన పనులు ఓపెన్ జిమ్, చిల్డ్రన్ పార్క్, ఆ తర్వాత సైడ్ డ్రెయిన్ నిర్మాణం కూడా చేపట్టేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. వీటిలో డ్రెయిన్ నిర్మాణానికి నిధులు మంజూరు కాలేదని అధికారులు చెబుతున్నారు.

60 అడుగులకు తగ్గించిన అధికారులు..

రెవెన్యూ రికార్డుల ప్రకారం ఈ రహదారి 100 అడుగులు వరకు ఉన్నది. రహదారికి ఇరువైపులా చిరు వ్యాపారులు, గృహనిర్మాణాలు చేపట్టడంతో కుదించుకు పోయింది. దీంతో నిధులు మంజూరైనా మూడేళ్లుగా పనులు నిలిచిపోయాయి. సూడా నిధులు వెనక్కి పోకుండా ఉండేందుకు స్థానిక ఎమ్మెల్యే మాలోత్ రాందాస్‌నాయక్ ఆదేశాల మేరకు మున్సిపాలిటీ టౌన్ ప్లానింగ్ అధికారులు అడుగులు వేశారు. కానీ 100 అడుగుల రోడ్డును 60 అడుగులకు కుదించడంతో స్థానికుల నుంచి పలు విమర్శలు వినిపిస్తున్నాయి.

నెల రోజుల్లో పూర్తి చేస్తాం..

సుడా నిధులు రూ.కోటి మంజూరయ్యాయని నిధులు వెనుకకు పోకుండా ఉండేందుకు రోడ్డు నిర్మాణం చేపడుతున్నాం. నెల రోజుల్లో రోడ్డు నిర్మాణం పూర్తి చేస్తాం. రోడ్డు నిర్మాణం పూర్తయిన తర్వాత సైడ్ డ్రెయిన్ చేపడతామని, అందరికీ సౌకర్యంగా ఉండేలా నిర్మాణం చేపడతాం.

– నరేష్‌రెడ్డి, మున్సిపల్, డీఈ